క్లుప్తంగా

నాగబాబుకు అభినందనలు



నాగబాబును సత్కరిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: ముంబై లోని సొమ్య విద్యా విహార్ స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగిన 43వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో కాకినాడకు చెందిన యాతం నాగబాబు పలు పతకాలు సాధించారు. ఆయనను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా పనిచేస్తున్న నాగబాబు మంగళవారం ఏడీసీని కలిసి 800 మీటర్ల విభాగంలో 2వ స్థానంలో నిలిచి వెండి పతకం, 4"400 మీటర్లు రిలే పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. అలాగే 4"100 మీటర్లు పరుగు పందెం రిలేలో 2వ స్థానంలో నిలిచి వెండి పతకం పొందారు. దీంతో నాగబాబును ఏడీసీ అభినందిస్తూ భవిష్యత్తులో మరింతగా రాణించి మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

లయన్స్ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ విశ్రాంత వీసీ ఐవీ రావు

బోట్‌క్లబ్: లయన్స్ ఎలైట్, లయన్స్ స్టార్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేట సుబ్బయ్య హోటల్ జంక్షన్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ ఐవీ రావు దీనిని ప్రారంభించి మాట్లాడుతూ చలివేంద్రాల వల్ల పాదచారులకు, వాహనచోదకులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఎండలు తగ్గేవరకూ చలివేంద్రాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. ఎలైట్ క్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సభ్యులు మండలీక వెంకటశాస్త్రి, సాగర్, టీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.


తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప: మండల పరిధి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లోని రక్షిత నీటి ట్యాంకులను శుభ్రం చేయించి, పైప్ లైన్లు బాగుచేయించి తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకునేలా చైతన్యపరచాలని ఎంపీపీ సూచించారు. అనంతరం ఎంపీడీఓ కె.అప్పారావు వివిధ శాఖల పని తీరుపై సమీక్ష జరిపారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఎ.వర్ధన్ మాట్లాడుతూ సామూహిక రక్షిత నీటి పథకాల ద్వారా తాగునీరు సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. మండల పరిషత్ ఏఓ గుత్తుల భీమశంకరరావు, ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం



ఆర్టీసీ ఉద్యోగులను సత్కరిస్తున్న సిబ్బంది

కాకినాడ: పదవీ విరమణ చేసిన ఐదుగురు ఆర్టీసీ ఉద్యోగులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు అయిన నారాయణ, యు.ఏడుకొండలు, కె.సత్యానందం, ఎంకే మూర్తి, డి.పాండురంగారావులను సంస్థ సిబ్బంది వారి సేవలను గుర్తుచేస్తూ సన్మానించారు. ఆర్టీసీ డీఎం ఎంయూవీ మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, ఏఈ కె.ప్రభాకరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఏవీవీఎస్ఎన్ రావు, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

27 మంది వలంటీర్ల రాజీనామా

కరప: మండల పరిధిలో 27 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేసి ఎంపీడీఓ కె.అప్పారావుకు పత్రాలను సమర్పించారు. కరప–2 సచివాలయం నుంచి ఇద్దరు, కొరిపల్లి నుంచి 9 మంది, వాకాడ నుంచి 9 మంది, గొర్రిపూడి–1 సచివాలయం నుంచి 5 మంది, గొర్రిపూడి–2 నుంచి ఇద్దరు చొప్పున వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు.

సొంతింటి కల సాకారం చేస్తా

- 18 నెలల్లో నిర్మాణాలన్నీ పూర్తి చేస్తా
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి





తండ్రి ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని



భర్తకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి

కాకినాడ: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో గెలిచిన 18 నెలల వ్యవధిలో స్థలాలు పొందిన 30 వేల మందికి ఇళ్లు నిర్మించాలన్నదే లక్ష్యమన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ముత్తానగర్‌లో ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటింట ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో పదివేల మందికి పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి, 30 వేల మందికి స్థలాలు ఇవ్వగలిగామన్నారు. ముఖ్యమంత్రి సహకారంతోనే ఇది సాధ్యమైందని, స్థలాలు పొందిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కూడా నిర్మించాలన్నదే ప్రధాన ఉద్దేశమన్నారు. ఐదేళ్ల పాలనలో కాకినాడ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, రాజకీయాలకు అతీతంగా అర్హతను ప్రాతిపదికగా తీసుకుని సంక్షేమ ఫలాలు అందించామన్నారు. చేసిన అభివృద్ధిని గుర్తించి రానున్న ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోసారి ప్రజాసేవ చేసే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ఒకప్పుడు ఎన్నికల మ్యానిఫెస్టోను పూర్తిగా తుంగలోకి తొక్కి, వెబ్‌సైట్ నుంచి తొలగించిన టీడీపీ ఇప్పుడు మరిన్ని దొంగహామీలతో ప్రజల ముందుకు వస్తోందన్నారు. ఇటువంటి పార్టీలను నమ్మొద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ద్వారంపూడి వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు వెలమల మల్లేశ్వరరావు, కొప్పనాతి సత్యనారాయణ, చిక్కాల సుధాకర్ తదితరులు ఉన్నారు.

ద్వారంపూడి మహాలక్ష్మి ప్రచారం

ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి 43వ డివిజన్ అచ్యుతాపురం రైల్వేగేటు ప్రాంతంలో భర్త ద్వారంపూడికి మద్దతుగా విస్తృత ప్రచారం చేశారు. వినాయకుని ఆలయం నుంచి బంగారుబిల్డింగ్ ప్రాంతాల్లో పర్యటించి గడచిన ఐదేళ్లలో భర్త చంద్రశేఖర రెడ్డి చేసిన అభివృద్ధిని వివరిస్తూ మరోసారి గెలిపించాలని కోరారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు జేడీ పవన్‌కుమార్, నల్లబెల్లి సుజాత, వాసంశెట్టి కృష్ణతులసి, స్థానిక నాయకులు కోక గిరి, గుత్తుల వీరవేణి, జొన్నాడ సుబ్రహ్మణ్యం, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెల ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి కుమార్తెలు డాక్టర్ అంజని, డాక్టర్ ప్రణీత తండ్రికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. జగన్నాథపురం 23వ డివిజన్ నూకాలమ్మ ఆలయం నుంచి డాక్టర్ అంజని ప్రచారం చేయగా 36వ డివిజన్ దుగ్గిరాల వారివీధి ప్రాంతంలో డాక్టర్ ప్రణీత ప్రచారం చేశారు. తెలుగుదేశం పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని వివరిస్తూ ద్వారంపూడి హయాంలో జరిగిన ప్రగతిని ప్రజలకు తెలియజేశారు. అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ద్వారంపూడికి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తే కాకినాడ నుంచి అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతారని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వీరి వెంట కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు మీసాల శ్రీదేవి, మీసాల దుర్గాప్రసాద్, నాయకులు బెజవాడ బాబి, సీడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై ఫోన్ చేయండి

కాకినాడ: ప్రస్తుత వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ప్రజలను సూచించారు. కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ జె.నివాస్ ఆదేశాల మేరకు వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ ప్రాంతంలో అయినా నీటి సమస్య ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990కు ఫోన్ చేస్తే సత్వర చర్యలు తీసుకుంటామని చెప్పారు. రూ.1.28 కోట్ల ఖర్చుతో వేసవి కార్యాచరణను సిద్ధం చేశామని కమిషనర్ తెలిపారు.

నృత్యంలో శిక్షణకు ఆహ్వానం

కాకినాడ రూరల్: వరల్డ్ డ్యాన్స్ డేను పురస్కరించుకుని జ్యోతి నృత్య కళా నికేతన్ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్ వద్ద పాత ట్రస్ట్ ఆస్పత్రి భవనం ఎదురుగా వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్టు యునెస్కో ఉత్తమ నాట్యాచారిణి పురస్కార గ్రహీత మద్దినాల లక్ష్మీజ్యోతి మంగళవారం తెలిపారు. నాట్యం పట్ల ఆసక్తి గల వారు శిబిరంలో పాల్గొని కూచిపూడి, భరత నాట్యం, ఆంధ్ర నృత్యంలో శిక్షణ పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శన నిర్వహించారు.

చురుగ్గా పూడిక తీత పనులు

కాకినాడ: నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మంగళవారం పర్యవేక్షించారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి స్థానిక కేన్సర్ హాస్పటల్ వెనుక భాస్కర పద్మ కల్యాణ మండపం ప్రాంతంలో పనులను పరిశీలించారు. ఈఎంఎక్స్–20 యంత్రాలతో చేస్తున్న పనుల ప్రగతిని పరిశీలించి సూచనలు ఇచ్చారు. వర్షాలు పడేలోపు నగరంలోని అన్ని ప్రాంతాల్లో పూడికలు తీయాలని ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తం

- ఆర్వో వెంకటరావు ఆదేశం
- ఓపీఓలకు ఒక రోజు శిక్షణ



ఓపీఓల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: రానున్న ఎన్నికలను సమర్థవంతంగా, సజావుగా నిర్వహించడంలో విధుల్లో ఉన్న సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో సోమవారం ఓపీఓలకు ఎన్నికల విధులపై ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఈవీఎం, వీవీ ప్యాట్ల నిర్వహణ సహా వివిధ అంశాలపై మాస్టర్ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇచ్చారు. ఎన్నికలకు ముందు రోజు, ఎన్నిక జరిగే రోజున తీసుకోవలసిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా విధులు నిర్వర్తించి ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. 351 మంది ఓపీఓలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిక్షణను ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఇతర ఎన్నికల అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఖాతాల్లోకే పింఛన్ల సొమ్ము

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక భద్రతా పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఖాతాల్లో జమ చేసేందుకు అవకాశం లేని వారికి మాత్రం ఇళ్ల వద్దకు పంపిస్తామన్నారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియపై సంబంధిత అధికారులు, సిబ్బందికి మంగళవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 30,729 సామాజిక భద్రతా పింఛన్లకు 23,935 మందికి ఒకటో తేదీన నేరుగా ఖాతాలోనే జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దివ్యాంగులు, అత్యంత వృద్ధాప్యంలో ఉన్న మిగిలిన 6,794 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా నేరుగా ఇళ్ల వద్దకే అందిస్తామన్నారు. వీలైతే మంగళవారం సాయంత్రానికే ఇళ్ల వద్ద పింఛన్లు అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.ఖాతాల్లో పింఛన్ సొమ్ము పడని వారికి రెండో తేదీ నుంచి ఇళ్ల వద్దకు పంపే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా పింఛన్‌దారులు ఎవ్వరూ సచివాలయాలకు వెళ్లవద్దని కమిషనర్ సూచించారు. సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేయడం లేదన్న విషయాన్ని పింఛన్ లబ్ధిదారులు గుర్తించాలని కమిషనర్ కోరారు.

పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

కరప: మండల పరిధిలో పింఛన్ల పంపిణీకి ఇబ్బంది లేకుండా బుధవారం నుంచి అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. కరపలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 11,625 మంది పెన్షనర్లు ఉండగా 8,793 మందికి బ్యాంక్ అకౌంట్లు ఉన్నాయని, వారికి నేరుగా రూ2,63,79,000 ఖాతాల్లో జమచేస్తామన్నారు. మిగిలిన వారికి గ్రామ సచివాలయం సిబ్బంది ఇళ్లకు వెళ్లి అందజేసేలా చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

మరింత సేవకు మరో అవకాశం ఇవ్వండి

- ప్రచార జోరు పెంచిన కన్నబాబు
- కాకినాడ అర్బన్‌లో చురుగ్గా పర్యటన



కాకినాడ రూరల్ నియోజకవర్గం అర్బన్ 48వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, సినీనటుడు గౌతంరాజు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడడంతో వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు ప్రచారంలో జోరు పెంచారు. నియోజకవర్గంలో కాకినాడ రూరల్, కరప మండలాలతో పాటు అర్బన్ డివిజన్లలో ఆయన విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. కాకినాడ అర్బన్‌లోని 8 డివిజన్లు రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉండడంతో ఇప్పటికి 2వ డివిజన్‌లో ప్రచారం చేపట్టారు. మంగళవారం ఉదయం కాకినాడ అర్బన్ 48వ డివిజన్‌లోను, సాయంత్రం 49, 50 డివిజన్లలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. కన్నబాబుతో పాటు సినీ నటుడు గౌతంరాజు పాల్గొన్నారు. ప్రచార వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూనే జనాల వద్దకు వాహనం దిగి వెళ్లి ఆశీర్వచనాలు కోరారు. 48వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌చార్జి పెద్దపాటి నాగబాబు, చెల్లి ధనరాజుల ఆధ్వర్యంలో ఎస్సీపేట, న్యూ కాలనీ, టెలిఫోన్ ఎక్ఛేంజ్ వీధి, లక్ష్మీగణపతి వీధి, కాల్వ గట్టు తదితర ప్రాంతాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. పెద్ద ఎత్తున మహిళలు ప్రచారంలో పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సంక్షేమంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామన్నారు. అర్బన్ ప్రాంతంలో పార్కులు అభివృద్ధి చేశామన్నారు. అర్హత కలిగన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరో సారి మరింత సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రసాద్, రమణ, సురేష్, రవి, చిన్ని, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం 50వ డివిజన్‌లో మాజీ కార్పొరేటరు ఐ.శ్రీను ఆధ్వర్యంలోను, 49 డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు కడియాల చిన్నా, జమ్మలమడక నాగమణి ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలిచేందుకు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల ముమ్మర ప్రచారం

కరప: ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం పాలన సాగించిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ అభ్యర్థి కురసాల కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి గత అయిదేళ్లలో జరిగిన అభివృద్ధినీ, మళ్లీ అధికారంలోకి వస్తే అమలుచేసే మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కన్నబాబు, సునీల్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కొరిపల్లిలో సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, ఎంపీటీసీ దేవిశెట్టి సూర్యప్రకాశరావు, తిబిరిశెట్టి గజేంద్రుడు, కోలా శ్రీనివాస్‌లు ఎన్నికల ప్రచారం చేశారు. చినకొత్తూరులో సర్పంచ్ చింతా నాగలక్ష్మి, గ్రామకమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి, గొర్రిపూడిలో గ్రామకమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీచైర్మన్ చీకాల అప్పలరాజు, పుణ్యమంతుల గంగరాజు, విజయరాడుపాలెంలో సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, జేఎస్‌వీ కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, బొండా చంటిబాబు, జి.భావారంలో సర్పంచ్ రొక్కాల గణేష్, ఆర్.తారకేష్, యండమూరులో మాజీసర్పంచ్‌లు మార్నె వెంకటరమణ, నురుకుర్తి వీరన్న, గ్రామకమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, షేక్ దరియా తదితరులు ఎన్నికల ప్రచారం చేశారు.



చినకొత్తూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సర్పంచ్ నాగలక్ష్మి

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన తమ్మవరం గ్రామస్తులతో ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో టీడీపీ నుంచి 200 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

కాకినాడ సిటీ: జగనన్న పాలనలో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తోందని, అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీకి మరోసారి ఓటు వేసి ఆశీర్వదించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి కురసాల కన్నబాబు కోరారు. మంగళవారం కాకినాడ రూరల్ మండలం తూరంగి ఏఎస్ఆర్ కాలనీలో ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పేదలను ఆదుకుంటున్న తీరును, తూరంగి అభివృద్ధికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేసిన అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీని వీడి సుమారు 200 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి వారిని ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి ఓటు అడుగుతున్న దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో విడదాసు సత్తిబాబు, ఆర్.కృష్ణ, డి.సత్తిబాబు, కె.సత్యనారాయణ, బి.వీరబాబు, ఎస్. కుమార్, ఏసుకుమార్, దుర్గాప్రసాద్, కృష్ణవేణి, బంగారమ్మ, పిల్లి నూకరాజు, పనసరాజులతో పాటు 200 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి బాబులు, అనిశెట్టి రామకృష్ణ, జగడం శ్రీహరి, జగడం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సముచిత స్థానం కల్పిస్తాం

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామస్తులు పలువురు టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం తమ్మవరం ఉప సర్పంచ్ గొల్లపల్లి దొరబాబు, సత్తిరాజు, డి.సత్తిబాబు తదితరులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో చేరడంతో ఆయన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారికి సముచిత స్థానం కల్పిస్తామ, వైఎస్సార్ సీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కన్నబాబు కోరారు. తమ్మవరంలో కల్యాణ మండపం నిర్మాణంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కురసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలు ఐక్యతతో ఉండాలి

- ద్వారంపూడి విజయానికి కృషి చేయండి
- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు



ఎమ్మెల్సీ కుడుపూడిని సత్కరిస్తున్న నాయకులు

కాకినాడ: శెట్టిబలిజలు ఐక్యతతో ముందుకు సాగాలని ఉభయ తెలుగురాష్ట్రాల శెట్టిబలిజల కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. శెట్టిబలిజలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విజయం కోసం ప్రతి ఒక్కరు కష్టించి పనిచేయాలన్నారు. స్థానిక రెవెన్యూ కాలనీ ప్రాంతంలో శెట్టిబలిజలకు కేటాయించిన స్థలాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కుడుపూడిని ఆ సామాజిక వర్గ ప్రతినిధులు సంఘ నాయకులు రెడ్డి రామపళ్లం రాజు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజికవర్గ కమ్యూనిటీహాలు నిర్మాణానికి ద్వారంపూడి స్థలాన్ని కేటాయించారన్నారన్నారు. ఆయన విజయం కోసం అంకిత భావంతో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యనమదల రవి, ఎల్లబోయిన చిన్న, పిల్లి శంకర్, చింతాకుల శ్రీనివాస్, బాబ్జీ, రమణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలకు గుర్తింపు



శానిటరీ సూపర్‌వైజర్ జిలానీని సత్కరిస్తున్న కమిషనర్ వెంకటరావు తదితరులు

కాకినాడ: కార్పొరేషన్ రెవెన్యూ అధికారి చెక్కా రమణ, శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ జె.వెంకటరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో చేసిన ఉత్తమ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు పురపాలక శాఖలో విధులు నిర్వర్తించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని వారిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ద్వారంపూడి సమక్షంలో..



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: టీడీపీ, జనసేన పార్టీల్లోని పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. యువ నాయకుడు మల్లిపాముల గణపతి ఆధ్వర్యంలో స్థానిక 7వ డివిజన్ రేచర్లపేట ప్రాంతానికి చెందిన ప్రసాద్, సుధ, బలాని రామకృష్ణ తదితరులతో పాటు సుమారు 30 మంది పార్టీలో చేరారు. ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కష్టించి పనిచేయాలని వీరికి సూచించారు.

టీడీపీ, జనసేన నుంచి..

వైఎస్సార్ సీపీ నాయకులు కోలాటి లక్ష్మణ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ, జనసేనల నుంచి మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ పార్టీలోని 25 మంది యువకులు, మహిళలు పార్టీలో చేరగా వారిని ఎమ్మెల్యే అభినందించారు.

టీడీపీలో రెండు రోజులే..

రెండు రోజుల క్రితం తెలుగుదేశంలో చేరిన ఎస్‌కె వలీజాన్, మరికొంత మంది యువకులు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. 21వ డివిజన్‌కు చెందిన వలీజాన్ రెండు రోజుల క్రితం టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అయితే చేరిన కొద్ది గంటలకే టీడీపీ విధానాలు, అక్కడి పార్టీనేతల పనితీరుతో అసంతృప్తి చెంది ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు.